## అష్టాదశ శక్తిపీఠ దేవాలయంలో మంత్రి పూజలు



2 లో




# మనం

## మెదక్

సంగారెడ్డి

సిద్దిపేట

గురువారం | 30 | నవంబర్ | 2023 | పేజీలు : 4




# నేడే పోలింగ్

- ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు
- ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఓటు హక్కు వినియోగించుకోనున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు దంపతులు





సిద్దిపేట, నవంబర్ 29, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఇప్పటికే జిల్లా ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్టమైన బందోబస్తు, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి పరిస్థితులను పరిశీలించనున్నారు. 1151 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9, 48, 664 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 1151 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1151 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2302 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు అదనంగా 817 మంది రిజర్వ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఆవరణలో ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని అధికారులకు అందజేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్, జియో ట్యాగింగ్ ద్వారా పోలింగ్ కేంద్రం సమాచారాన్ని ఎప్పటికప్పుడు సిపి, ఉన్నతాధికారులు నేరుగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమీషనర్ శ్వేతలు ప్రతి రోజు పర్యవేక్షించారు.

### -ఓటు హక్కును వినియోగించుకోనున్న సీఎం

సీఎం కేసీఆర్ తన స్వగ్రామమైన చింతమడకలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సీఎం రానున్న నేపథ్యంలో హెలీప్యాడ్‌ను మంత్రి హరీష్‌రావు బుధవారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ సతీసమేతంగా చింతమడకకు చేరుకోనున్నారు. అదేవిధంగా సిద్దిపేటలోని భారత్ నగర్‌లో

మిగతా 2లో..

## ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

### -అడిషనల్ డిసిపి అడ్మిన్ శ్రీనివాస్‌రావు, ఏసిపి రమేష్



గజ్వేల్, నవంబర్ 29, మనం న్యూస్ః నేడు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఓటింగ్ ప్రక్రియలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డిసిపి అడ్మిన్ శ్రీనివాస్‌రావు, గజ్వేల్ ఏసిపి రమేష్ అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని రూట్ మొబైల్ అధికారులకు, సిబ్బందికి బుధవారం స్థానిక ఐఓసి భవనంలో పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించాల్సిన విధుల గురించి దిశానిర్ధేశం చేశారు. ఈవియం, వివి ప్యాట్, ఎన్నికల సామాగ్రి రక్షణ పూర్తి బాధ్యత రూట్ మొబైల్ అధికారులదే అని, రూట్ మొబైల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అనుక్షణం పెట్రోలింగ్ చేస్తుండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే అక్కడికి చేరుకొని పరిష్కరించాలని, సంబంధిత పోలీస్ ఉన్నతాధికారులకు తెలపాలని సూచించారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు నిష్పక్షపాతంగా నిర్భయంగా ఓటు వేసేలా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సిఐ జాన్‌రెడ్డి, రూరల్ సిఐ జానకిరామ్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అష్టాదశ శక్తిపీఠ దేవాలయంలో మంత్రి పూజలు

కొండపాక, నవంబర్ 29, మనం న్యూస్ః కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని మంత్రి హరీష్‌రావు బుధవారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అష్టాదశ శక్తిపీఠ దేవతా మూర్తులను సందర్శించుకున్న అనంతరం మంత్రిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. మంత్రి వెంట పిఎసిఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ దుర్గయ్య, ట్రస్టు అధ్యక్షులు అయిత నాగరాజు ఉన్నారు. అదేవిధంగా దేవాలయాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## పోలీసుల విధులకు యువకుల ఆటంకం

### -14 మంది యువకులపై కేసు నమోదు

దుబ్బాక, నవంబర్ 29, మనం న్యూస్ః శాసనసభ ఎన్నికల దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉన్నందున పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన 14 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మంగళవారం రాత్రి 12 గంటలకు దుబ్బాకు చెందిన ఒక బిఆర్ఎస్ కార్యకర్త తన కారులో దుబ్బాకకు వస్తుండగా పెద్ద చీకోడు గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు మద్యం, నగదు తరలిస్తున్నారనే ఆరోపణలతో కారును ఆపి అడ్డగించారు. దీంతో సమాచారం అందుకున్న దుబ్బాక సిఐ మున్నూరు కృష్ణ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని కారును క్షుణ్ణంగా తనిఖీ చేయగా కారులో ఎలాంటి నగదు, మద్యం లభ్యం కాలేదు. కేవలం బిఆర్ఎస్ అభ్యర్థికి సంబంధించిన గోడపత్రికలు మాత్రమే లభ్యమైనప్పటికీ కొంతమంది యువకులు కారులోని బిఆర్ఎ కార్యకర్తతో గొడవకు దిగి కారును ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడంతోపాటు ఎంత నచ్చచెప్పినా వినకుండా సిఐ, ఇతర పోలీస్ సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసుల విధులను ఆటంకపరిచిన 14 మంది యువకులపై సిఐ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# నేడే పోలింగ్

మొదటి పేజీ తరువాయి..



ఆంబిటస్ స్కూల్‌లో మంత్రి హరీష్‌రావు దంపతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

### -ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటు ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించినట్లు, ఓటరు కార్డు స్లిప్పు లేకపోయినా ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏ కార్డునైనా తీసుకువెళ్లి ఓటు వేయవచ్చని సూచించారు. పుకార్లను నమ్మవద్దని, ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే సమీప పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశం ఒక్క ఓటుకు మాత్రమే ఉందన్నారు. సమాచారం కేంద్రం నెంబర్ 1950 నిరంతరం పని చేస్తుందని, దీని ద్వారా పోలింగ్ కేంద్రం, బూత్‌నెంబర్ వివరాలను తెలుసుకోవచ్చన్నారు.





### -ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు

జిల్లాలో పది డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సిపి శ్వేత తెలిపారు. ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 2632 మంది అధికారులు పని చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే రాజకీయ పార్టీల బ్యానర్లు, లోగోలు, ఎవరూ ధరించవద్దన్నారు. సిద్దిపేట



జిల్లాకు చెందిన వ్యక్తులు తప్ప ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు జిల్లాలో ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎవరూ ఉండవద్దన్నారు. అధునాతన సాంకేతికతతో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 278, సాధారణ పోలింగ్ కేంద్రాలు 731 ఉన్నట్లు ఆమె తెలిపారు. సిద్దిపేట కమీషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని బార్డర్ పిఎస్ పరిధిలలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన సీ విజిల్‌యాప్ ద్వారా ఫిర్యాదులను అందజేయవచ్చన్నారు. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ ఆవరణలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్ధేశం చేశారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

### -పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

### -ఏర్పాట్లు పరిశీలించిన ఆర్ఓ గరిమా అగ్రవాల్

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 29, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా నేడు దుబ్బాక శాసనసభ స్థానానికి జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దుబ్బాక ఆర్ఓ గరిమా అగ్రవాల్ తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని పది మండలాల్లో 1,98,100 మంది ఓటర్లు ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా 253 పోలింగ్ కేంద్రాలు, వంద మంది మైక్రో అబ్జర్వర్లు, 1012 మంది ఎన్నికల సిబ్బంది, 500 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారన్నారు. నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎన్నికల సిబ్బందికి ఈవియం యంత్రాలు, పోలింగ్ సామాగ్రిని ఎన్నికల పరిశీలకులు మన్మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో అందించినట్లు తెలిపారు. ఆయా పోలింగ్ సిబ్బంది ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని, నేడు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించి క్లియర్ చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. నియోజకవర్గంలో వందశాతం ఓటింగ్ జరిగేందుకు ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఓటర్ స్లిప్పులు లేదా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 13 రకాల



గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒక కార్డును తీసుకువెళ్లి తమ ఓటును వినియోగించుకోవచ్చని సూచించారు.





# దీక్షా దివస్ చారిత్రాత్మకం


**-తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిన రోజు**

**-యావత్ తెలంగాణను ఏకం చేసింది**

**-రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు**



సిద్దిపేట, నవంబర్ 29, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అయితే నా శవ యాత్ర... లేదంటే తెలంగాణ జైత్ర యాత్ర అంటూ నిరాహార దీక్ష చేపట్టిన నవంబర్ 29 రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేటలోని రంగధాంపల్లి వేదికగా నిర్వహించనున్న నిరాహార దీక్షకు కరీంనగర్ నుండి బయల్దేరిన కేసీఆర్‌ను అల్గునూరు చౌరస్తా వద్ద అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించిన రోజు ఇప్పటికీ స్ఫూర్తిదాయకమే అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా మంత్రి హరీష్‌రావు రంగధాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అమరులకు జోహార్‌లు అర్పించారు. అనంతరం సిద్దిపేటలోని ఆయన నివాసంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారిని



అభినందించారు. ఎంతో పట్టుదలతో సమైక్యాంధ్ర పాలకులు అనుక్షణం అడ్డుపడుతున్నా మొక్కవోని ధైర్యంతో చేపట్టిన నిరాహార దీక్షే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గమైందని, యావత్ తెలంగాణను కదిలించిందన్నారు. 11 రోజుల నిరాహార దీక్షతో కేసీఆర్ చావు అంచుల్లోకి వెళ్లడంతో 33 పార్టీలు తెలంగాణకు మద్ధతివ్వగా తప్పని పరిస్థితుల్లో కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని చెప్పడంలో నిరాహార దీక్ష ఎనలేని పాత్ర పోషించిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం చేసిన పోరాటం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నిధులు సమకూర్చుకోవడం, నీళ్లను సాధించుకోవడం జరిగిందన్నారు. నిరాహార దీక్షకు వేదికైన రంగధాంపల్లి నాడు వేలాది మంది పోలీసుల బూట్ల చప్పుళ్లతో భయాందోళనలకు గురి చేశారన్నారు. 2004లోనే నాటి కాంగ్రెస్ ఇచ్చిన మాట మేరకు తెలంగాణ ఇచ్చుంటే బలిదానాలు జరిగుండేవి కాదని, 2009లో తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చెప్పి ప్రకటనలో జాప్యం చేయకున్నా ఇంతమంది అమరులయ్యే వారు కాదన్నారు. ఏది ఏమైనా దీక్షా దివస్ యావత్ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి దాయకమని అన్నారు.







# స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



మెదక్/పాపన్నపేట, నవంబర్ 29, మనం న్యూస్ః రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్లందరికీ ఎపిక్ కార్డుల పంపిణీ పూర్తి చేయడం జరిగిందని, నేడు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్‌లో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉన్నందున పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఆయా పార్టీల ప్రతినిధులు ఎవరూ ఉండరాదన్నారు. ఓటింగ్‌లో ఈసారి నూతన ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున నూతనంగా ఓటు హక్కు పొందిన ప్రతి యువత తమ ఓటు వేసి తమ విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఓటర్ స్లిప్పులు అందని వారు భారత ప్రభుత్వం గుర్తించిన ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు, ఎంఎన్ఆర్ఈజిఎస్, బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్‌ఉ,



కార్మిక మంత్రిత్వ శాఖ ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, జాతీయ జనాభా రిజిష్టర్ జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారత పాస్‌పోర్ట్, ఫోటోతో ఉన్న పింఛన్ పత్రం, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, చట్ట సభల్లో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపుకార్డుల్లో ఏదేని ఒక గుర్తింపు కార్డును పోలింగ్ స్టేషన్‌కు తీసుకువెళ్లి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు.

### -పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా సాధారణ పరిశీకులు పృథ్వీరాజ్, పోలీస్ పరిశీలకులు సంజయ్ కుమార్ తుకారాం, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పోలింగ్ అధికారులు ఈవియం యంత్రాలను, పోలింగ్ సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం ఆయా పోలింగ్ కేంద్రాల నిర్వాహకులకు మెదక్, నర్సాపూర్

## -వందశాతం పోలింగ్ లక్ష్యం
## -వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ సరళి పరిశీలన
## -జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా అందించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు కేటాయించిన కేంద్రాల్లోనే బస చేయాలని, ఓటు గోప్యతకు అనుగుణంగా కంపార్ట్‌మెంట్, సిబ్బంది, ఏజెంట్‌లు కూర్చునే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా ఉదయం 5:30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించడం




జరుగుతుందన్నారు.

### -ఎంసిఎంసి మీడియా సెంటర్ పరిశీలన

శాసనసభ ఎన్నికల దృష్ట్యా లోకల్ ఛానల్‌తోపాటు ఇతర ఎన్నికల ప్రకటనలు చేయకుండా ఎంసిఎంసి టీమ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి కేంద్రంతోపాటు చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల రికార్డింగ్ పనితీరును పరిశీలించారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1950, సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను, వాటి పరిష్కారాలను, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీమ్‌ల పనితీరు, మీడియా కథనాలు, పెయిడ్ న్యూస్, పత్రికా ప్రకటనల వంటివాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

### పార్టీల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులు
### -ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

మెదక్/పాపన్నపేట, నవంబర్ 29, మనం న్యూస్ః శాసనసభ ఎన్నికల






దృష్ట్యా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల నియమావళికి లోబడి ఎలాంటి పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనరాదు. కానీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. కుల్చారం మండలం పైతరా గ్రామంలో నీటిని సరఫరా చేసే ఉద్యోగి బట్ట జీవయ్య ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రాజకీయ పార్టీలో ప్రచారం చేస్తూ విధులను నిర్లక్ష్యం చేసినట్లు సి విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు ఉన్నత శాఖ అధికారులు విచారణ చేయగా అందిన ఫిర్యాదు నిజమేనని తేలడంతో సదరు ఉద్యోగిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా మాసాయిపేటలోని పశుసంవర్ధక శాఖలోని ప్రాథమిక కేంద్రంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. విద్యాసాగర్ రాజకీయ పార్టీ



ప్రచారంలో కండువాతో ప్రచారం చేశాడని వీడియో రికార్డుతో ఫిర్యాదు అందగా ఉన్నతాధికారులు విచారణ జరిపి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు నిర్ధారించారు. ఈ మేరకు విద్యాసాగర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.







